శ్రీ రమణ జ్యోతి Sri Ramana Jyothi
ఆగష్టు 2018 August 2018

ఈ సంచికలో ... IN THIS ISSUE ...

1. డా॥ కే.యస్. గారి 51వ ప్రసంగం — డా॥ వి. రామదాస్ మూర్తి 3
2. శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు — మల్లాది ఫణిమాల 9
3. శ్రీదేవి కాలోత్తర జ్ఞానాచార విచార గ్రంథ భాగము — ముదిగొండ వీరభద్రయ్య 14
4. శ్రీ భగవాన్ పాద సన్నిధిలో — జి. శ్రీహరి రావు 21
5. యోగమార్గము, ఆత్మవిచారణా మార్గము — డా॥ వి. రామదాస్ మూర్తి 23
6. Guru is Everything — Dr. K. Subrahmanian 30
7. 'I' Is A Door (Part 1) — Philip Renard 35
8. The Turning Point — Sadhu Natanananda 40
9. Blinded, Yet Blissful
The Story of Neelakanta Dikshitar 42
10. Serious Humor 46
11. Brahmarishi Daivarata — A.R. Natarajan 48

శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు : కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్
(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)

**Editorial Board:** Telugu: **Dr. V. Ramadas Murthy, Malladi Phanimala, Katravulapalli Subbalakshmi**
English: **V. Krithivasan, N.S. Ramamohan, Sneha Choudhury**

# విద్యుక్త ధర్మాన్ని ఆచరించాలి

ఆంగ్ల మూలం: డా॥ కే.యస్. గారి 51వ ప్రసంగం

తెలుగు అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి

## అవశ్య కర్తవ్యం

కురుక్షేత్ర మహాసంగ్రామంలో, యుద్ధభూమిని ప్రవేశించిన తరువాత అర్జునుడు తన దగ్గరి బంధువులను, గురువులను, పెద్దలను చంపడానికి ఇష్టపడడు. "ఎవ్వరినీ చంపడం నాకు ఇష్టం లేదు. ఇంతమందిని చంపి, రాజ్యాన్ని గెలుచుకోవడంలో అర్థం లేదు" అని అర్జునుడు భీష్మించుకున్నాడు. ఆ పరిస్థితిలో శ్రీకృష్ణుడు అతనితో "సత్యాన్ని, ధర్మాన్ని పరిరక్షించడం నీ కర్తవ్యం, అధర్మమైన బాటలో నీవు నడవడానికి వీలులేదు. ప్రత్యర్థుల పట్ల నీ సంబంధ, బాంధవ్యాలను గురించి ఆలోచించే ప్రశ్న లేదు. దుష్టశక్తులతో పోరాడడం నీ కర్తవ్యం. యుద్ధం చేయడానికి నీవు ఒప్పుకున్నావు. అలాగ చేయడం నీ విధి కూడ. ఇతర అనురాగ, మమకారాలను దృష్టిలో వుంచుకోకుండ, ఫలితాలను గురించి ఆలోచించకుండ, స్నేహితులు, శత్రువులు అన్న అంశాన్ని పక్కకు పెట్టి, నీ విధిని నీవు ఆచరించు" అని హితబోధ చేశాడు.

ఇక లౌకిక విషయాలకు వస్తే ఒక ఆఫీసర్ తనకంటే తక్కువ హోదాలో వుండే ఉద్యోగి ఆఫీసు కార్యక్రమాల విషయంలో ఏదైనా తప్పు చేశాడనుకోండి. ఆ ఉద్యోగి పై అధికారికి ఇష్టమైన వాడైతే, వెంటనే బాధ పడతాడు. అతడిని ఆ అపరాధం నుండి

రక్షించడానికి ప్రయత్నిస్తాడు. విధిత చర్య తీసుకుంటాడు. ఒకవేళ ఏదో మరొక తప్పుడు మార్గం ద్వారా కప్పిపుచ్చితే, ఎప్పుడో ఒకప్పుడు అది బయటపడక మానదు, ఇబ్బందిలో ఇరుక్కోవడమూ తప్పదు. శ్రీకృష్ణుడు అర్జునునితో "ఒక కార్యం కోసం నీవు జన్మించావు. ఆ విధిని నీవు నిర్వర్తించు" అని అన్నాడు. ఇంతకూ శ్రీకృష్ణుడు ఎవరు? అర్జునుని రథసారథిగా యుద్ధంలో వచ్చాడు. అర్జునుడు రథాన్ని ఎటువైపు పోనిమ్మంటే, అటు పోనిచ్చాడు. ఇది మరొక అసాధారణమైన విషయం. సారథిగా వుండడానికి శ్రీకృష్ణుడు అంగీకరించాడు. అదే మన అధీనంలో పనిచేసే ఉద్యోగి మనల్ని ఒకరోజు పాటు డ్రైవర్‌గా వుండమంటే, మనకు చెప్పలేనంత కోపం వస్తుంది. కాని నమ్రత వున్నచోట, అహం లేనప్పుడు అలాంటి పోకడ వుండదు. భగవాన్ ఆశ్రమ నియమాలను పాటించేవారు. ఇది నా ఆశ్రమం, నా ఇష్టం వచ్చినప్పుడు వుంటాను, లేదా వుండను అని చెప్పి వుండవచ్చు. కాని అలా ఎప్పుడూ చేయలేదు. అలా కట్టుబడి వుండడం చిరాకు కలిగించే విషయంగా భావించలేదు కూడ.

సాధారణంగా ఎన్నో విషయాలను గురించి మనలను ఇతరులు సలహాలు అడుగుతుంటారు. మనకు తోచిన సలహాలను ఇవ్వడం జరుగుతుంటుంది కూడ. అడిగినవారు వింటారు. ఆ తరువాత నిర్ధారణ కోసం మరొకరి దగ్గరకు వెళ్ళ వచ్చు. అలాంటప్పుడు మూడవ వ్యక్తి మరొక రకమైన సూచన

ఇవ్వవచ్చు. ఒకవేళ అది ఎక్కువ సబబు అనిపిస్తే వారు ఆ సూచనను పాటించే అవకాశం వుంటుంది కదా! పరిస్థితిని సవ్యంగా అర్థం చేసుకుంటే సరే. అదే అహం అడ్డువస్తే, మనం చెప్పింది ఆ వ్యక్తి పాటించలేదని ఉక్రోషం ప్రదర్శిస్తాం. మంచిది ఏదో నాకే తెలుసు అన్న అహం అడ్డు వస్తుంది. దురదృష్టవశాత్తు, అవతలి సలహా పనిచేయక నష్టం జరిగితే, తాను చెప్పినది అనుసరించలేదని, ఫలితం అందుకే అలా అయిందని ఒక పైశాచిక ఆనందం కలుగుతుంది. అహం ప్రభావం అంతగా వుంటుంది.

మరొక సందర్భం పరిశీలిద్దాం. సలహా అడుగుతున్న వ్యక్తి మన మీద పూర్తి నమ్మకం వున్నవాడైతే, అతనిపై మనకు ప్రేమ వుంటే, అప్పుడు పరిస్థితి వేరుగా వుంటుంది. మనపై బాధ్యత వుంటుంది గనుక మార్గం ఏదో బాగా ఆలోచించి సలహా ఇస్తాము. కాని ఆ సలహా పాటించి తీరాలన్న ఉద్దేశం వుండడం మంచిది కాదు. అసలు అన్నిటికంటే ఉత్తమం, అవతలివారు అడిగితే తప్ప సలహాలు ఇవ్వకుండ వుండడమే. అడిగినప్పుడు మంచిది అనుకున్నది చెప్పి, అక్కడితో ఆ విషయాన్ని వదిలెయ్యాలి.

**ఆఖరి నిర్ణయం మనది కాదు**

భగవద్గీతలోని 18 అధ్యాయాలలో శ్రీకృష్ణుడు అర్జునునికి కర్మయోగం, భక్తి యోగం మొదలైన వాటిని గురించి చెప్పాడు. కాని ఆఖరుకు, ‘‘జీవితం గురించిన అతి గుహ్యమైన ఎన్నో

విషయాలు చెప్పాను. నీవు కూలంకషంగా అంతటినీ క్షుణ్ణంగా ఆలోచించి నీ ఇచ్ఛ ప్రకారం నడుచుకొమ్మన్నాడు. కాని ఇలాగే చేయమని బంధించలేదు. మనం మామూలుగా చేసే పొరబాటు ఏమిటంటే మన పిల్లలు మనం చెప్పినదే చేయాలని గాఢంగా అనుకుంటాం. చిన్నప్పుడు వాళ్ళ మీద ప్రేమతో వాళ్ళు అలా నడుచుకోనప్పటికి, పట్టించుకోము. కాని వాళ్ళు పెద్దవాళ్ళయ్యే కొద్దీ, చెప్పినది చేయకుంటే, వాళ్ళకు ఏమౌతుందో అని చింతిస్తాం. మన ఉద్దేశం మంచిదై వుండవచ్చు. కాని ఆ వయసు వచ్చిన తరువాత వాళ్ళను ప్రభావితం చేసే ఎన్నో అంశాలుంటాయి. ప్రపంచంలోని విషయాలను ఆకళింపు చేసుకొనడం, తోటి వయసు వాళ్ళ ప్రభావం మొదలైనవి బలంగా పని చేస్తాయి. అందుకే మన కర్తవ్యం గనుక, మన బాధ్యత గనుక వాళ్ళకు మంచిది అనుకునేవి చెప్పి ఊరకుండాలి. లేకుంటే నిరాశ చెందుతాం. ఒక తరం మారినప్పుడు లౌకికంగా విలువలూ మారుతాయి. వాళ్ళే ఆలోచించి నిర్ణయించుకొంటారు. మనలో మార్పులు తెచ్చుకుంటే, మనచుట్టూ వున్నవాళ్ళు కూడ మారుతారు. మనం మారక, ఇతరులను మార్చడానికి ప్రయత్నిస్తే అది ఫలించదని భగవాన్ చెబుతారు.

కొందరు గురువులు తమ శిష్యులు తాము చేసే బోధన లేదా ఉపదేశాలను 'తు','చ' తప్పకుండ పాటించాలని అనుకుంటారు. వాళ్ళు తమతోనే వుండి, అలాగే నడుచుకోవాలని భావిస్తారు. వాళ్ళు యోచించే మార్గాన్ని ప్రభావితం చేసి తమవైపు

మాత్రమే వుండాలని ఆశిస్తారు. కుటుంబంలో పిల్లలు, భార్యా భర్తల విషయాలలో కూడ ఇదే జరుగుతుంది. ఇలా బంధనాల మధ్య ఇరుక్కోవడమే ఈనాటి పలు సమస్యలకు కారణం.

ఇక రమణమహర్షి అవలంబించిన తీరు పూర్తిగా భిన్నంగా వుంటుంది. వారు ఎవరినీ తమ వద్దకు రమ్మనలేదు. ఎవరిని వెళ్ళిపొమ్మని కూడ చెప్పలేదు. ఏ బంధనాలు లేకుండ స్వతంత్రంగా వున్నప్పుడు మాత్రమే అది సాధ్యమౌతుంది. శ్రీకృష్ణుడు అలాంటి స్వతంత్రాన్ని ఇవ్వగలిగాడు. భగవద్గీతలో యోగం గురించి చెబుతూ, యోగ అంటే ఏమిటి? మనం చేసే కర్మల్లో అత్యున్నత స్థాయిని ప్రదర్శించడం. అంటే మన కర్తవ్యాలు, విధులు, ఏమిటో వాటిని పూర్తిగా శక్తివంచన లేకుండ నిర్వర్తించడం. అవి విజయవంతమౌతాయా, లేదా అన్న దానితో సంబంధం లేకుండ చేయాలి. అదే నిజమైన యోగి లక్షణం. ఆ పని చిన్నదా, గొప్పదా అన్నది ముఖ్యం కాదు. అలా నడుచు కొనడానికి అవసరమైన శక్తిని భగవంతుడే ఇస్తాడు. ఆయన కృప లేనిదే మనం అలా చేయలేము.

### బాధ గురువు, బోధ గురువు

గురువుల్లో రెండు రకాలు - బోధ గురువు, బాధ గురువు అని వుంటారు. నిజమైన జ్ఞాన గురువు తాను చెప్పదలచుకున్నది బోధించి మిగతాది శిష్యునికే వదలుతాడు. ఇక బాధ గురువు తన దగ్గరకు వచ్చిన వాళ్ళను కట్టి పడేసి తాను చెప్పినదే

ఆచరిస్తున్నారా లేదా అని గమనిస్తూ వుంటాడు. శిష్యునికి స్వతంత్రత లేదు. అద్భుతమైన విషయమేమిటంటే గీతలో ఎంతో విశదంగా దాదాపు 800 శ్లోకాలలో తాను చెప్పదలచుకున్నది చెప్పిన శ్రీకృష్ణుడు, "అతి గుహ్యామైన విషయాలను ఎన్నో చెప్పాను. కాని నేను చెప్పిన వాటిని గురించి బాగా ఆలోచించి నీకు తోచిన విధంగా చేయి" అన్నాడు. యుద్ధం చేయమని ఖచ్చితంగా చెప్పలేదు. ఆఖరుకు (ఇక నాలుగైదు శ్లోకాలు గీతలో మిగిలి వున్న వేళ) అర్జునుడు "నా మోహం, భ్రమ, తొలగి పోయాయి. విషయాలు స్పష్టంగా తెలిశాయి" అన్నాడు. - నష్టమోహః స్మృతి ర్లబ్ధా, త్వత్ప్రసాదాన్ మయాచ్యుత, స్థితోస్మి గత సందేహః కరిష్యే వచనం తవ - నీ సలహాను పాటిస్తాను, అన్నాడు.

ఆధ్యాత్మిక విషయాలు, ప్రాపంచిక విషయాలు రెండూ వేరనుకుంటాం. కాని ఈ రెండింటికి దగ్గర సంబంధం వుంది. మోక్షం అంటే యధార్థంగా స్వతంత్రం అని అర్థం. అందరం స్వతంత్రత కావాలని కోరుకుంటాం. ఇతరులు కూడ అలాగే భావిస్తారన్నది మనం మరువ రాదు. అలాగని పరిత్యాగం అంటే ఇతరుల పట్ల దయ, దాక్షిణ్యాలు లేకుండ ప్రవర్తించడం అని మాత్రం కాదు. ఇతరుల బాగోగులకు సూచనలు చేయవలసి వస్తే చేయాలి. కాని వాటి ఆచరణ జరుగుతోందో లేదా అని పట్టించుకోకూడదు. కృతజ్ఞతను కూడ వాంఛించరాదు.

*   *   *

# రమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

## కుంజుస్వామి

శ్రీ కుంజుస్వామి 1920 సం॥ నుండి 1932 సం॥ వరకు మహర్షి పరిచారకునిగా వ్యవహరించారు. వారి గురువైన శ్రీకృపానంద స్వామి వద్ద శ్రీరమణుల గొప్పదనాన్ని గురించి విని, కుంజుస్వామి 1920 సం॥లో శ్రీరమణ దర్శనానికై కేరళలోని స్వగ్రామాన్ని వదలి వచ్చారు.

తిరువణ్ణామలై చేరడానికి కుంజుస్వామి ఎన్నో ఇబ్బందులు పడ్డారు. చేతిలో డబ్బు తక్కువగా వుండడం, వెళ్ళాల్సిన రైళ్ళు విపరీతంగా ఆలస్యంగా రావడం, బయలుదేరడం ఒకవైపు, తిరువణ్ణామలైలో ప్లేగు వ్యాధి కారణంగా అక్కడికి టికెట్టు ఇవ్వక పోవడం మరొకటి. ఆఖరికి ఒక పెద్దమనిషి సలహా ప్రకారం తిరుక్కోయిలూర్ వరకు టికెట్టు తీసుకొని, చీకట్లో తిరువణ్ణా మలైలో దిగుదామన్నాడు. కాని అక్కడికి టికెటు ధరకు పావలా తక్కువ పడింది. నిరాశకు గురైన కుంజుస్వామికి పట్టాల మధ్య ఆ డబ్బు కనిపించడంతో ఆయనకు భగవాన్ కృపా ప్రభావం తెలిసి వచ్చింది. ఆ రాత్రి ఒక మంటపంలో నిద్రపోయిన కుంజు స్వామికి అరుణాచలం దర్శనమిచ్చింది.

కుంజుస్వామి స్కందాశ్రమంలో శ్రీరమణుల సన్నిధి చేరారు. మళయాళంలో కుంజుస్వామి తమ బాల్యము, జపం చేయడం, ప్రవచనాలు ఇవ్వడం వంటి తమ విషయాలను తెలుపుకున్నారు.

మందహాసంతో భగవాన్ అన్నీ విన్నారు. కుంజుస్వామి తమకు లోని అలజడి అధికంగా వుందని, అది పోయేందుకు మార్గాన్ని తెలుపమని అడిగాడు. "ముందు నీవెవరో తెలుసుకో. మనసును అంతర్ముఖం చేసి, హృదయాన్ని గమనించు" అని మహర్షి సమాధానమిచ్చారు. వారిద్దరే ఉన్న సందర్భాలలో భగవాన్ చూపు కుంజుస్వామిపై పడిన ప్రతీసారి, ఆయన ఏదో తెలియని శాంతి, ఆనందాన్ని అనుభవించేవారు. ఆ తరువాత మామూలు స్థితికి రాగానే ఒళ్ళు జలదరించేది. అక్కడ వున్న 18 రోజుల్లోనూ అలా జరిగేది. తిరిగి ఇంటికి వెళ్ళిన తరువాత భగవాన్ సన్నిధిలో అనుభవించిన ధ్యానస్థితి క్రమేపి తగ్గి, మళ్ళీ మొదటి స్థితి చేరు కున్నారు. అందుకే కుంజుస్వామి మళ్ళీ ఇల్లు వదలి, ఇక భగవాన్ వద్దనే శరణుపొంది అక్కడే వుందామన్న సంకల్పంతో వచ్చి ఆశ్రమంలో ఏదో ఒక పనిచేస్తూ ఉండిపోయారు.

మహర్షి పలు సందర్భాలలో అయాచితంగా కుంజుస్వామిపై కరుణను ప్రసరింపజేశారు. ఒకసారి కుంజుస్వామి కేరళలో వారి గ్రామానికి వెళ్ళవలసి వచ్చింది. రైలు టికెటుకు సరిపడ డబ్బు మాత్రమే వుంది. దారిలో భోజనానికి అవసరమైన డబ్బు కూడ లేదు. ఆ మధ్యాహ్నం అనుకోకుండ ఎవరో ఒక భక్తుడు వస్తూ చాలా పూరీలను ఆశ్రమవాసుల కోసం తెచ్చాడు. సాధారణంగా ఒక రెండు, మూడు పూరీలకంటె ఎక్కువ తీసుకోని మహర్షి ఆ పూట ఆరు పూరీలను వేయించుకున్నారు. మహర్షి తాము ఒక పూరీని మాత్రమే తీసుకుని, మిగిలిన అయిదింటినీ ఒక

పొట్లంలో కుంజుస్వామికి కట్టి ఇచ్చారు. అందరూ ఎంతో చలించి పోయారు.

మహర్షి యొక్క కృపాకటాక్ష వీక్షణాలలో నిరంతరం ఓలలాడే భాగ్యాన్ని కుంజుస్వామి అనుభవించారు. పండ్రెండు సంవత్సరాలు భగవాన్‌ను సేవించిన తరువాత కుంజుస్వామి ఆత్మవిచార మార్గంలో తీవ్రమైన సాధన చేయాలనే సంకల్పంతో రమణుల అనుమతి పొంది, రమణాశ్రమం వదలి పల్లాకొత్తు చేరారు. పల్లాకొత్తులో ఒక చిన్న గుడిసెలో నివసించేవారు. ఎడతెగని సాధనను చేసేవారు. భక్తులకు శ్రీరమణులకు సంబంధించిన పలు కథలు చెబుతూ రమణ బోధలను అందరితో పంచుకొనే వారు. "శ్రీ భగవాన్ నాకు తల్లి, తండ్రి, గురువు, దైవం. వారి కృపయే నన్ను వారి వద్దకు చేర్చింది" అని అందరితో చెప్పేవారు.

కుంజుస్వామి తమ స్మృతులను తమిళంలో "యెనదు నినైవుగళ్" అనే పేరుతో గ్రంథస్థం చేశారు. జ్ఞానగుళికలైన సద్గురువు యొక్క పలుకులు ఎంతో పవిత్రమైనవి. వాటిని భావితరాల జిజ్ఞాసువులకు మార్గదర్శకంగా పదిలపరచడం శిష్యుల ప్రథమ కర్తవ్యం. ఇరవై సంవత్సరాల వయసులో శ్రీరమణుల మొట్ట మొదటి శిష్యులలో ఒకరైన కుంజుస్వామి తమ మధుర స్మృతులను గ్రంథస్థం చేసి ఈ విషయంలో కృతకృత్యులయ్యారు. వారు వ్రాసిన "యెనదు నిన్నైవుగళ్"ను డా. కె.ఎస్.గారు "లివింగ్ విత్ ది మాస్టర్ - రెమినిసెన్‌సెస్ బై కుంజుస్వామి" అనే పేరుతో ఆంగ్లంలోనికి అనువదించారు.

భగవాన్ మధ్యాహ్న భోజనం తరువాత పల్లాకొత్తుకు వచ్చి అక్కడి చిన్న కోనేరు చుట్టూ నడుస్తూండేవారు. తప్పక కుంజుస్వామిని కలిసి "ఏమి చేస్తున్నావు? ధ్యానం ఎలా జరుగు తోంది? ఆత్మ విచారణ జరుపుతున్నావా." అని అడిగేవారు. లౌకిక సమస్యలను, తన ఆర్థిక పరిస్థితిని భగవాన్‌కు చెప్పడం ఉచితం కాదని కుంజుస్వామి భావించేవారు. "భగవాన్ అన్నీ తెలిసిన వారు. నా పరిస్థితి చెబితేగాని వారికి తెలియదా?" అని అనుకునే వారు. తిండిలేని పరిస్థితిని కూడ ఓర్చుకునేవారు.

ఒక రోజు కుంజుస్వామి యొక్క ధనికుడైన స్నేహితుడు వచ్చి భగవాన్‌కు నమస్కరించాడు. "ఓహో! నీవు నీ స్నేహితుడిని చూడాలని వచ్చావా?" అని మహర్షి అడిగారు. దానికి అతను "అవును స్వామీ! నిన్న మీరు నా కలలోకి వచ్చి, నీ స్నేహితుడు మూడు రోజులుగా ఆకలితో అలమటిస్తుంటే, నీవు హాయిగా నిద్రపోతున్నావా." అని అడిగారు. "వెంటనే వెళ్ళి నీ స్నేహితుడిని కలువు" అన్నారు. కుంజుస్వామిని కలిసినప్పుడు నిజంగా మూడురోజులుగా అతను తిండి లేకుండ వున్నాడు, సరుకులు ఏమీ లేవని తెలుసుకున్న స్నేహితుడు అతనికి భోజనం పెట్టించి, ప్రతినెల, ఐదురూపాయలు కుంజుస్వామికి ఖర్చులకై పంపుతానని భగవాన్‌కు మాట ఇచ్చాడు. ఆ తరువాత ఆశ్రమం ఎదుట ఒక ఇంటిని కుంజుస్వామి కోసం కట్టించాడు కూడ.

శ్రీరమణ మహర్షి 'సంపూర్ణ రచనలు' తమిళపుస్తక రూపంలో అచ్చు అయినప్పుడు, ఆ వెలకు సాధువులు చాలా మంది ఆశ్రమం నుండి కొనుక్కోలేక పోయారు. ఒక భక్తుని ద్వారా ఒక నోటు

పుస్తకంలో దానిని కాపీ చేయించి కుంజుస్వామికి ఇప్పించారు. భగవాన్ ఫోటోను అందులో అతికించారు. కుంజుస్వామి అరుణాచలం చిత్రం దొరకడం లేదనుకొంటున్న తరుణంలో మహర్షి స్వయంగా కుంజుస్వామిని ఆ నోటు పుస్తకం తెమ్మని దానిపై స్వయంగా అరుణాచలం బొమ్మను గీసి ఇస్తే కుంజుస్వామి ఎంతగానో ఆనందించారు.

కుంజుస్వామి చివరి రోజుల్లో, దాదాపు మంచం పట్టి, కనీసం కూర్చోలేక పోయినప్పటికీ తమ వద్దకు వచ్చిన సాధకులందరికీ, భగవాన్‌తో తమకు గల అనుబంధాన్ని, భగవాన్‌కు అరుణాచలం, ఇంకా కోతులు, ఇతర జంతువులు, కొండ మీది రాళ్ళు, చెట్లు, మొదలైన వాటితో గల అనుబంధాన్ని చెబుతుండేవారు. అలాగ చివరి క్షణాల వరకు శ్రీరమణుల బోధనలనే ఆచరిస్తూ, నలుగురితో పంచుకుంటూ ధ్యానంలోనే కన్నుమూశారు.

- సేకరణ: మల్లాది ఫణిమాల

ఆధారాలు: శ్రీరమణ మహర్షితో ముఖాముఖి

రమణ పెరియ పురాణం

**శ్రీ రమణజ్యోతి సంవత్సరీక చందాను (రూ.50/- నుంచి రూ.80/-కు) మరియు జీవిత చందాను (రూ.500/- నుంచి 750/-కు) పెంచిన విషయం పాఠకులకు తెలుసు. ఇప్పటివరకు ఈ అధికమొత్తాలను చెల్లించని చందాదారులు దయచేసి ఈ మొత్తాలను చెల్లించివలసినదిగా ప్రార్థన.**

శ్రీ శంకరులు బోధించిన

# శ్రీదేవి కాలోత్తర జ్ఞానాచార విచార గ్రంథ భాగము

## (శ్రీరమణుల వాగమృతధారా సహితము)

- తెలుగు అనువాదం: ముదిగొండ వీరభద్రయ్య

(శ్రీదేవి కాలోత్తర జ్ఞానాచార పటలం అన్న దానిని (దేవ పూజా విధానాలకు సంబంధించిన శాస్త్ర విషయాల గ్రంథ భాగం) ఉపా గమంగా భావిస్తారు. జ్ఞానాన్ని గురించి, జ్ఞాన సిద్ధికి అనుసరించా ల్సిన ప్రవర్తన గురించి శివుడు పార్వతికి చేసిన బోధ ఈ రచనలోని విషయం.

భగవాన్ శ్రీరమణులు అరుణగిరి మీద 1910 నుంచి 1916 సం॥ దాకా విరూపాక్ష గుహలో ఉన్న తొలి రోజుల్లో వారు ఈ కాలోత్తరాన్ని చదవడం జరిగింది. వెంటనే అందులో వారికి 1895 లో తమకు కలిగిన జ్ఞాన ఆవిష్కార అనుభవం యొక్క పోలికను గుర్తించారు. తాము అరుణాచలం నుంచి లోకానికి ప్రసాదిస్తున్న జ్ఞానమార్గపు మూలాలు ఈ గ్రంథ విభాగంలో ఉండడం వల్ల ఎంతో ఉత్సాహంగా దానిని తమిళంలోనికి అనువదించారు. కాని ఈ గ్రంథం రాతప్రతిని 1930 సం॥లో నారాయణ రెడ్డిగారు ముద్రించారు. ఆ తరువాత పారాయణానికి అనుకూలంగా భగవాన్ దీనిని సవరించారు. ఆ పిమ్మట ముద్రణలలో గాని భగవాన్ తమ పేరును అనువాదకునిగా తెలపడానికి ఒప్పుకోలేదు.

భగవాన్ మౌనస్వామిగానే వున్నప్పటికీ, గిరిపైకి చేరుకున్న తరువాత జిజ్ఞాసువుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పేవారు. వాటిలో ఈ కాలోత్తరంలోని అంశాలకు జతచేయాల్సిన అంశాలు,

వాటిని సమర్థించే అంశాలు, వాటి తరువాత తెలుసుకోవలసిన విషయాలు చోటు చేసుకున్నాయి.

ప్రస్తుత అనువాద రచనలో వాటిని ఆయా శ్లోక తాత్పర్యాల రూపంలో భగవాన్ అభిప్రాయాలుగా ఇవ్వబడ్డాయి. అధిక భాగం 'శ్రీరమణ భాషణములు', కొంత 'నీ సహజస్థితిలో ఉండు' అన్న గ్రంథాలనుండి తీసుకోబడ్డాయి. భగవాన్ తమిళంలో పద్యాలుగా అనువదించారు గనుక ప్రస్తుత రచన కూడ మాత్రా ఛందస్సును అనుసరించి రచించబడ్డాయి. లయ భంగం జరిగినప్పటికి, మూల రచనకు అనుసరణ కోసం తగిన విధంగా అలాగే ఉంచబడ్డాయి. - రచయిత)

**గణేశ స్తుతి:**

**శ్రీ గణేశు కరుణాసముద్రుదివ్యామృత మౌనరూపు**
**పార్వతికి శంకరప్రోక్తమగునీ శ్రీదేవి కాలోత్తరానుసర**
**సాధక పుష్పప్రకాశు, జగత్సాక్షి కేవలుమౌనివర్యుధ్యానింతు**

- జగన్మాతయైన శ్రీ పార్వతికి శ్రీశంకరుడు చెప్పినదీ శ్రీదేవి కాలోత్తర జ్ఞానాచార విచారపటలమను (దేవపూజా విధానాలకు సంబంధించిన విషయములు తెలుపు గ్రంథ భాగం) ఉపాగమం. దీనిననుసరించే సాధకులనెడి పూలకాంతిచేత, ప్రకాశించునట్టి శ్రీ గణేశుని భగవాన్ శ్రీరమణులు స్తుతిస్తున్న ధ్యానశ్లోక అనుసరణం ఇది.

**శ్రీదేవి ఉవాచ:**

**1.** **సర్వజనుల ముక్తికొఱకు మోక్షమార్గమెరుగుటకయి**
**జ్ఞానమననేమొ, ఆచారమదెట్టిదో, తెలుపుమయ్యా, జగత్పతీ!**

**ఈశ్వర ఉవాచ:**

**2. జ్ఞానాచారముల రెంటిని నీకిపుడె తెల్పెద వరారోహ!**
**నిర్మల మోక్షమందెద్దానిచే జ్ఞానసాధకులు ప్రవేశింతురో.**

**3. వరాననా! కాలజ్ఞానమ్ముచే జ్ఞానప్రాప్తికలుగకున్న**
**శతకోటి శాస్త్రములచేనైన బోధము పొందలేరు.**

- సాధన అంతిమ దశలో బోధపడే జ్ఞానం కాలజ్ఞానం. ఈ ఉప ఆగమంలో అంటే శ్రీదేవి కాలోత్తర జ్ఞానాచార విచారంలో శ్రీ శంకరులు శ్రీదేవికి బోధచేసినదీ జ్ఞానమునే. దీనిని పొందుటకు ఏవేవి చేయకూడదో, ఏవేవి చేయవలయునో - కూడ చివరి శ్లోకాలలో వారుపదేశించినారు.

- ఈ భావాలను పోలిన భగవాన్ శ్రీరమణుల బోధలీ కింది విధంగా ఉన్నాయి.

- శాస్త్రాలు, ఎఱుక గలిగినవారికి కావు. వారికవి అనవసరం. అజ్ఞానులు వాటిని కోరరు. శాస్త్రాలు పరికించేవారు ముముక్షువులు మాత్రమే. అంటే జ్ఞానులకూ, అజ్ఞానులకూ కూడా శాస్త్రాలు వలదన్నమాట.

- శాస్త్ర పాండిత్యం తనకు తానొక వాసన. అనుభవం సమాధి.

- నిరక్షరాస్యత అజ్ఞానం; పాండిత్యం చదువుకొన్న అజ్ఞానం. ఇర్వురూ సరియైన గమ్యమేదో తెలియని వారే.

**4. అందువలన నోపార్వతి, శంకాభీతుల విడచిపెట్టి**
**నిరాకులవై, శ్రద్ధతోడ, జ్ఞానసిద్ధికుత్సాహివికమ్ము.**

**5. సర్వభూతాభయప్రదవగుచు, నిర్మమకరుణలతో**
**ముక్తికొఱకు (యోగతత్పరతతో) ఓ దేవి భజించు**
**మీకాలోత్తరమును.**

**6&7.గాలివలె చలించు చిత్తము నెవడు నిశ్చలము చేయు**
**అతడె షణ్ముఖు, డతడె గురువు సర్వదేవతలకు, నతడె**
**యోగి, అతడె తపోధనుడతడె పండితుడు**
**పరమార్థము చేత నతడె కృతార్థుడు, మహాభాగుడు!**

- నిశ్చలంగా ఉండు. నేను బ్రహ్మమని తెలుసుకో. నిశ్చలంగా ఉండడమంటే ఆలోచనలు లేకుండా, అని తెలుసుకో. తలపులు మాను అన్నది ప్రధానం. (భాషణములు).

**8&9.వాయురీతి కదలు మనము నే ఉపాయము చేత బంధింతురో**
**నదియె మోక్షమునకుపాయమౌ, సత్తుని పొందనదె గుణమగు**
**అదియె ప్రజ్ఞ, అదియె స్థిరత, అదియె పుణ్యమగు సాధకులకు**
**అదియె తీర్థమదియె దానమ్ము, నిస్సంశయముగ నదియె తపము**

- ఆత్మ శుద్ధచైతన్యం. ఆత్మను తెలుసుకోవడానికి చేయ వలసిందంతా 'నిశ్చలంగా' ఉండటమే.

- ఉండటమే నీ విధి, ఇట్లుండుట, అట్లుండుట కాదు. ఆ విధానమంతా ముక్తసరిగా 'నిశ్చలంగా ఉండు', 'ఊరకే ఉండు'లో ఉంది. నిశ్చలత అంటే ఏమిటి? నిన్ను నీవు నష్టం చేసుకొమ్మని. రూపమేదైనా సంకటకారణమే.

- నిజమే. అచల చిత్తమే శుద్ధమనస్సు. జ్ఞాని మనస్సు శుద్ధ మనస్సు. బ్రహ్మము జ్ఞాని మనస్సు కన్యము కాదని జ్ఞాన వాసిష్టమే చెప్పుచున్నది. కాబట్టి బ్రహ్మము శుద్ధ మనస్సే.

**10. చిత్తచలనమె సంసారమగు తన్నిశ్చలతయె మోక్షమగు
అందువలన పూర్ణప్రజ్ఞతోడ చిత్తమునిక స్థిరము చేయగావలె**

- "నేను" అనే స్థితిలో ఏ ఆలోచనా లేకుండా ఉంటే 'నేను' అనే భావం కూడా పోతుంది. అలాగే భ్రమకూడా శాశ్వతంగా పోతుంది. దీపాలను ఆర్పివేసినపుడే, లేక దీపాలకాంతిని తగ్గించినప్పుడే, సినిమాలో బొమ్మని చూడగలవు. దీపాలను వెలిగిస్తే బొమ్మలు కనబడవు. అట్లాగే ఆత్మ అనే జ్యోతియొక్క వెలుగులో అన్ని పదార్థాలూ మాయమౌతాయి.

**11. ఇతరము లేనట్టి ఏకాంతిక సుఖ మెటనున్నదో అదియె పరమోత్కృష్టము కర్మలేని పరతత్త్వమే బుధుని రంజింపచేయదు?**

- ఏకాంతం అంటే మనసును నిశ్చలంగా నిల్పటం.

- ఆత్మ ఎప్పుడూ కర్త కానేరదు. కర్త ఎవరో తెలుసుకో, ఆత్మ దర్శనమిస్తుంది.

- జీవించటానికీ, పనులు చేయటానికీ మనస్సు అవసరమౌతుంది. కాని మనస్సు యొక్క ప్రమేయం లేకుండానే జ్ఞాని ఈ రెండూ చేస్తాడు.

- జ్ఞాని ఎన్ని పనులనైనా చేయవచ్చు. వాటిని ఎంతో సమర్థవంతంగానైనా చేయవచ్చు. ఎటొచ్చీ - తాను చేస్తున్నానని కాని, ఆ పని తనదని కాని భావించడు. అతని దేహాన్ని ఉపయోగించుకొని, ఆ పని చేయించుకొనే శక్తి ఏదో ఉన్నది.

**12. విషయజ్ఞాన నివృత్తుడగు నిర్మల జ్ఞానతత్పర మేధావి
తా గోరు కొనకుండగనే అక్షయమగు మోక్షమొందుకద.**

**13. అస్మితాయుక్త చైతన్యమ్ము శక్తియని పిలువబడుచున్నది శక్తి ప్రకాశితమగు నీవిశ్వమ్ము, తత్సంకల్ప దృశ్యరూపమె ఆలంబన విముక్తమైనపుడు నిష్కలంక జ్ఞానమనబడుచున్నది.**

- నిద్ర మేల్కొన్నప్పుడొక వెలుగు కనిపిస్తుంది. అది మహత్తత్త్వం గుండా వెడుతున్న ఆత్మప్రకాశం. దానిని విశ్వచైతన్య మన్నారు. అది అరూపము. ఆ తేజం అహంకృతిపై పడి ప్రతిఫలి స్తుంది. అపుడు దేహమూ ప్రపంచమూ గోచరిస్తాయి. ఈ మనస్సు స్వరూపము ఈ ప్రతిఫలించిన చైతన్యకాంతిలో విషయాలు అగు పిస్తాయి. ఈ కాంతిని 'జ్యోతి' అన్నారు.

**14. ఏ శూన్యము చిన్మాత్రకమై కేవలమై, అహమనునంశయగు నది ముక్తి బీజమగుచు సద్యోగ ప్రవర్తకమనబడు**

- తలపెక్కడ పుట్టుతుందో చూడు; మనస్సునుండి. మనో వ్యాపారాలు ఎవరికో చూడు; అహమికకు. మనస్సు నా అహమికలో లీనంచేసి, అహమిక మూలం వెదుకు; అది అదృశ్య మౌతుంది. (అప్పుడది 'అహం'గా ముక్తిబీజమవుతుందన్నది దీనికి కొనసాగింపు.)

**15. నాడీ చక్ర పద్మదేవతా బీజ రూపాదుల నెపుడు ధ్యానించరాదు.**

**16. అక్షయమగు మోక్షేచ్ఛగలవారలీ కుంభక మంత్రజాల ప్రాణాయామ ధారణాది సర్వమ్ము నొనరింప బనిలేదు.**

- హఠయోగం శుద్ధిచేయు పద్ధతి. అది ప్రాణాయామానికి దారితీసి నీకు మనశ్శాంతి కూడా కల్గిస్తుంది.

- మనో నిగ్రహానికి ప్రాణాయామముపకరిస్తుంది. కాని ప్రాణా యామం మాత్రంతో ఆగకూడదు. దానిపైని ప్రత్యాహార, ధారణ,

ధ్యాన, సమాధులను గూడ అభ్యసించవలె. అప్పటికిగాని పూర్ణ ప్రయోజనం సిద్ధించదు.

- తలపులను సూటిగా అరికట్టలేని వానికి ప్రాణాయామం విధించారు. ధ్యానం ఫలించిన తర్వాత ప్రాణాయామం లేకున్నా మనస్సు అధీనంలోకి వస్తుంది.

**17. ఇట పూజా నమస్కార జపధ్యానములు లేవు**
**జ్ఞేయమొకటి తప్ప తెలియవేరొకటి లేదు.**

**18. బహిర్ముఖ చిత్తులకు జనియించు బంధహేతువులు**
**బహిశ్చిత్త వారణ చేతనె లోకబాధ పొంద నేరరు.**

**19. బైటనని, లోనననని, నడుమనని, క్రిందయని ఏదియు లేదు**
**సర్వాకారమదియె, నిరాకారమయ్యు, స్వదీప్తితో స్వయం**
**వేద్యమది (తనకు తానె తెలియబడునది స్వయం ప్రకాశమ్ముతో)**

- నీ నిజస్థితిలో ఉండు. దిగి రావలసినది గాని, ప్రత్యక్షమవ వలసినది గాని ఏదీ లేదు. అహంకారం పోవటమొక్కటే జరగ వలసినది. నిత్యమూ సంస్థితమై ఉండేది ఎప్పుడూ ఉంటుంది.

**20. దేనినాలోకించి జీవులొనరింతురొ కర్మ బాహుళ్యమ్ము**
**తత్ఫలము నొందెద, రందువలన నిరాలోకమునవలంబింపవలె**

**21. స్వభావ స్థితిలోన హేతువులేదు, ఫలము లేదు, కర్మ లేదు**
**లోకము లేదు, లౌకికుడు లేడు, ఈ సర్వమ్మును లేదు.**

**- నీ సహజ స్థితిలో ఉండు.**

- జగద్భావనలతోనే తల ముక్కలుగా ఉంది. అసలు ఉద్దేశం భావనలన్నీ వదలగొట్టి శుద్ధాత్మలో స్థిరపడవలెనని. భావశూన్య సద్భావస్థితి. (సశేషం)

## శ్రీ భగవాన్ పాద సన్నిధిలో (At the feet of Bhagavan)

ఆంగ్లమూలం: టి.కె. సుందరేశ అయ్యర్

(గత సంచిక తరువాయి) తెలుగు అనువాదం: జి. శ్రీహరిరావు

కృతయుగంలో అరుణాచలము అగ్ని స్వరూపము దాల్చింది. త్రేతాయుగంలో పర్వతం స్ఫటిక స్వరూపముతో ప్రకాశించింది. ద్వాపర యుగంలో స్వర్ణ రూపంతో గోచరించి, కలియుగంలో శిలారూపంలో మనకు దర్శనమిస్తోంది. ఈ ప్రాంతాన్ని బల్లాల దేవుడనే రాజు పరిపాలించే కాలంలో అరుణాచలం ఆయన రాజధాని. అడిగిన వారెవరికీ 'లేదు' అని సమాధానం చెప్పరని ప్రసిద్ధి కెక్కారు ఆ మహారాజు. అరుణాచలేశ్వరుడు ఒక పసికందు రూపంలో వచ్చి మహారాజు ఒడిలో ఆడుకునేవాడని పురాణగాథ. రాజుకు సంతానం లేనందున ఆయన శ్రాద్ధక్రియలూ, కర్మకాండా తానే చేస్తానని వరమిచ్చాడట పరమశివుడు. ఈ రోజుకు కూడా యీ కార్యక్రమము జరుగుతూనే వుంది.

ఇచ్చటి పర్వతమే సాక్షాత్తూ అరుణాచలేశ్వరుడని భావిస్తారు. కొండ చుట్టూ పరిక్రమణం చేసి అనేక మంది సిద్ధులు సంపాదించారు. దేవతలూ, మహర్షులూ, రాజులూ, మరి అనేక మానవులూ, మానవేతరులూ. పరిపక్వత పొందిన ఎందరో ధన్య జీవులు గిరి ప్రదక్షిణ చేస్తూనే వున్నారు. సాక్షాత్తూ పరమేశ్వరుడే, సంవత్సరానికి రెండుసార్లు గిరి ప్రదక్షిణ చేస్తాడు.

పర్వతానికి అష్టదిక్కులలో, అష్టలింగాలూ, అష్ట నందీశ్వరులూ, అష్ట తీర్థాలూ వున్నాయి. పర్వతం చుట్టూ 360 పవిత్ర

జలాలున్నవి. ఈ రోజులలో, కొన్నిటిని మాత్రమే మనము చూడగలుగుతున్నాము. వీటిలో ఇంద్రతీర్థమూ, అగ్ని తీర్థమూ, ఈశాన్య తీర్థమూ, ఖడ్గ తీర్థము వంటివి ప్రసిద్ధి కెక్కినవి. బ్రహ్మ తీర్థమూ, శివగంగ, అరుణాచలేశ్వరుని దేవాలయములోనే వున్నవి. ములైపాల్ తీర్థము కొండ మీద వున్నది.

దేవాలయ గోపురాలూ, కట్టడాలూ ఎంతో పెద్దవి. వాటివలెనే, ఆలయంలో అనేక వాహనాలు చూడగలము. వీటి మీద సర్వా భరణములతో అలంకరింపబడిన దేవతలు ఊరేగింపబడతారు. ఇంతటి శోభాయమానమైన ఊరేగింపులు మనము యితర చోట్ల చూడలేము.

జ్ఞాన సంబంధులూ, వాగీశ్వరులూ అరుణాచలమును దర్శించి, స్వామినీ, అమ్మనీ కీర్తిస్తూ గానాలు చేశారు. అరుణాచలే శ్వరునిపై వారు పాడిన ఐదు పాటలు 'తేవారు'లో నిక్షిప్త మయ్యాయి. ప్రపంచ ప్రసిద్ధి కెక్కిన మాణిక్యవాచకుల 'తిరువెంబావై, ఇక్కడే పర్వతం వెనుక వైపు అడి అణ్ణామలలో, మొదట గానం చేయబడింది.

తిరువణ్ణామలలోనే, జ్ఞానానుభూతి పొందిన తరువాత, అరుణగిరినాథులు, సుబ్రహ్మణ్య స్వామి మహిమను తన 'తిరుప్పుగళ్' పాటల ద్వారా లోకానికి అందించారు. అమ్మ ఉమాదేవి ఉపాసకులైన సంబంధన్‌ను ఓడించారు. మహారాజు ప్రబుద్ధ దేవరాయల వారికి శ్రీసుబ్రహ్మణ్యస్వామి దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని దేవాలయంలో 'గోపురతు ఇలయనార్', 'కంబద్దు ఇలయనార్' కట్టబడ్డాయి.

*(మిగతా 29వ పేజీలో)*

# యోగమార్గము, ఆత్మ విచారణా మార్గము

(మౌంటెన్‌పాత్, ఏప్రిల్-జూన్ 2007 (సంపుటి 44, సంచిక-2) లో 'యోగ' అన్న శీర్షికతో ప్రచురితమైన 'కీ వర్డ్' యొక్క స్వేచ్ఛానువాదం)

అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి

'యోగ' అన్న సంస్కృత పదానికి, జీవాత్మ పరమాత్మల ఐక్యత, జీవ, బ్రహ్మంల ఏకీకరణ, మనసులో ఆత్మలో లీనమైన భావన, అన్న పలు అర్థాలున్నాయి. ఈ రోజుల్లో యోగ అన్న పదం అతి సాధారణంగా వినిపిస్తోంది. కాని అంత మాత్రాన దాని యధార్థ భావ, ఉద్దేశ, ఫలితాలను పూర్తిగా అర్థం చేసుకున్నారని అనడానికి వీలులేదు. దానికి ఆ శాస్త్రంలో పలు అంగాలు ఉండడం, వాటి అర్థాలు వేర్వేరు స్థాయిల్లో వివిధంగా వుండడం కారణాలు కావచ్చు. 'జ్ఞానం' అనే పదం వివేకముతో, సంపూర్ణ ధార్మిక విజ్ఞానాన్ని పొంది వుండడమన్న అర్థాన్ని గోచరింప జేస్తుంది. ఎందుకంటే, ఆత్మజ్ఞానం (శివబోధ) కలిగినప్పుడు వ్యక్తిత్వ భావన (జీవ బోధ) అసత్యమైనదని గుర్తించినప్పుడే జీవాత్మ, పరమాత్మల ఐక్యత జరుగుతుంది. మొదటి దశల్లో అవి రెండూ విడివిడిగా వున్నట్లు భావించినప్పటికీ, జీవాత్మ అంటూ తక్కువ స్థాయిలో ఒకటి స్వతంత్రంగా వుంటూ, ఉన్నత స్థాయిలోని పరమాత్మలో కలుస్తుందని, రెండూ విడివిడిగా వుంటాయని భావించడానికి వీలు లేదు. జీవబోధ అన్నది హేత్వర్థకమైన అజ్ఞానం (అవిద్య) నుండి ఉదయించిన ఒక గూఢమైన, తప్పుడు అభిప్రాయం మాత్రమే. అది ఆత్మవిచారణ ద్వారా కలిగిన జ్ఞాన ప్రకాశంలో మరుగైపోతుంది.

'ఐక్యత' చెందడమన్న అర్థాన్ని ఇచ్చే 'యుజ్' అనే మూల పదం నుండి 'యోగ' ఏర్పడింది. 'యోక్' అన్న ఇంగ్లీషు పదం కూడ యోగ నుండి పుట్టినదే. అందుకే ఐక్యం అన్నది సంసారం నుండి విముక్తినిచ్చే జ్ఞానోదయాన్ని తెలిపే రూపాలంకారంగా ఉపయోగింపబడిన ఔపచారిక పదం. అయినప్పటికి, ఆత్మ యొక్క ఏకత్వాన్ని గుర్తించడం, శుద్ధము, అనంతమైన బుద్ధిని ఉపయోగించినప్పుడే సాధ్యమౌతుంది. ప్రాచీనయోగి పతంజలి యొక్క 'అష్టాంగ యోగసూత్రం' ఈ విషయంపై రచించబడిన చాలా గొప్ప గ్రంథం. ఆత్మవిచారణ చేయగల స్వచ్ఛమైన మనసు, లలితమైన బుద్ధి పొందడానికి వ్యక్తికి తప్పనిసరిగా సంపూర్ణమైన మూర్తిమత్వం (పర్సనాలిటి) కలిగి వుండాలి. పదహారేళ్ళ వయసప్పటికే శ్రీరమణులు అలాంటి యోగ్యతలు కలిగి, ఒక్క క్షణంలో, ఒక్క అంగలో ఆధ్యాత్మిక పయనాన్ని ముగించారు.

పరిమితమైన వ్యక్తిత్వం యొక్క మిథ్యాస్వభావాన్ని అధిగమించిన దశలో లభించే జ్ఞానాన్ని ఆర్జించడానికి పూర్వమే మూర్తిమత్వం యొక్క సంపూర్ణతను సాధించడమే 'యోగ' యొక్క ఉపయోగం. అందుకే జ్ఞాననిష్ఠను సంపాదించడానికి తొలిమెట్టుగా యోగి కావడానికి ప్రయత్నించమని శ్రీకృష్ణుడు అర్జునునికి పదేపదే సూచించాడు.

మనసును జయించడానికి, స్వీయ ప్రవీణతను సాధించడానికి, పతంజలి ఎనిమిది సూత్రాలను ప్రతిపాదించాడు. అందులో మొదటి రెండు - యమ, నియమ - ఆధ్యాత్మిక జీవనానికి పునాదులు వేసే స్వచ్ఛమైన నీతి, నిస్వార్థత, దైవభక్తికి

ప్రాధాన్యతను ఇస్తాయి. ఇక ఆ తరువాతి రెండు - ఆసన, ప్రాణాయామం - వ్యక్తికి ఎక్కువ కాలం పాటు, తీవ్రమైన ధ్యానానికి అవసరమైన శారీరక సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఉద్దేశింపబడ్డాయి. ప్రాణాయామం (శ్వాస నియంత్రణ) ప్రాణశక్తికి సంబంధించిన నాడీశుద్ధికి సహాయపడి, మనసును శాంతింప జేసి, ఆధ్యాత్మిక పురోగతికి అవసరమైన సత్వగుణాన్ని పెంచు తుంది. ఆత్మవిచారణపై ధ్యాసను కేంద్రీకరింపజేసే మానసిక ఏకాగ్రతకు ప్రాణాయామం దోహదపడుతుందని భగవాన్ నొక్కి చెప్పారు. ఈ నాలుగు ప్రక్రియలు, హఠయోగం యొక్క భాగాలు. ఇక మనసును ప్రత్యక్షంగా లొంగదీసుకునేందుకు ఉపయోగపడే రాజయోగంలో ప్రత్యాహార, ధారణ, ధ్యానం, సమాధి అంతర్భాగాలు.

సాంప్రదాయిక పతంజలి యోగమార్గానికి, భగవాన్ ప్రతిపాదించిన విచారమార్గానికి, వివరాల విషయంలో భేదం వుంటుంది. ముఖ్యంగా, యోగమార్గంలో సంకల్పశక్తికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. కాని విచారమార్గంలో సంకల్పానికి మూలమైన మనసు యొక్క యథార్థతయే ప్రశ్నింపబడుతుంది. సంకల్పం రంగం లోనికి వచ్చినపుడెల్ల, ప్రతిఘటించే శక్తులతో పోరాటమన్నది కూడ తయారవుతుంది. సమాధి (మనసు ఆత్మలో లీనం కావడం) స్థితి చేరడానికి ముందు చిత్తశుద్ధి, మనసు యొక్క ఏకాగ్రతల అవసరాన్ని యోగ నొక్కి చెబుతుంది. అంటే, మనసుకు ఏదో కొంత యధార్థత ఆపాదిస్తున్నట్లు అర్థమౌతుంది. ఈ పరిస్థితి ధ్యానానికి సంబంధించిన అడ్డంకులన్నీ తొలగే వరకు

సాగుతుందన్న మాట.

ఇక మొదటి నుండి భగవాన్ విచారమార్గంలో మళ్ళీ మళ్ళీ మనసుకు యధార్థత లేనట్లు చెబుతూనే వుంటారు. విచారణ మార్గం యొక్క ప్రక్రియ మొత్తంలో ప్రతి ఆలోచన విషయంలోను, దాని మూలం ఎక్కడుంది? ఎక్కడి నుండి ఈ ఆలోచన ఉదయిస్తోంది? లేదా ఈ ఆలోచన ఎవరికి వస్తోంది? అన్న ప్రశ్నలు వేసుకోవాలని అంటారు. అంటే సంకల్పిత ఆధారిత సాధనను పూర్తిగా ప్రక్కకు పెడతారు. ఏదో మరీ ప్రాథమికంగా నిజాయితీ విషయం ప్రస్తావనకు వచ్చినప్పుడు మాత్రం విచారణ మార్గంలో సంకల్పం యొక్క ప్రసక్తి వస్తుంది. అదీ జాగరూకతతో విషయాన్ని గమనించే దిశ నుండి ధ్యానాన్ని మళ్ళించక వుండడానికి మాత్రమే. స్వయంగా భగవాన్ యోగమార్గాన్ని లలితంగా విమర్శిస్తూ, ఆ పద్ధతిని తిరుగుబోతు ఎద్దును కొమ్ములు పట్టి బలవంతంగా అదుపుచేసే ప్రయత్నంతో పోలుస్తారు. అదే, విచారణ మార్గంలోనైతే, అలాంటి ఎద్దుకు పచ్చిగడ్డిని చూపిస్తూ, అది వుండాల్సిన చోటికి రప్పించడం లాంటిది. శ్రమ, దాని వల్ల కలిగే అలసటను నివారిస్తుంది.

మరో విధంగా చెప్పాలంటే, యోగలో మనసును అదుపు చేసి, ఒక స్వాధీనమైన భూతంగా భావించి, దానితో బానిసలాగ మనం చెప్పిన పనిని చేయించడం లాంటిది. అందులో ఒక ప్రమాదమేమిటంటే, మనం జాగరూకతతో వుండకపోతే, భూతమే పరిస్థితిని తన అదుపులోనికి తీసుకుని మనకు అవాంఛిత ఫలితాలను అందిస్తుంది. మనసును ఒక చైతన్యవంతమైన,

స్వతంత్రమైన ఉనికి కలదిగా భావించడమే దానికి కారణం. అందుకే బుద్ధికి వేదాంత మార్గంలో శిక్షణ ఇచ్చి, మనసును జయించడమన్నదే అంతిమ అంశంగా భావించకుండ, జ్ఞానం దిశలో పయనింపజేస్తే, తద్వారా వ్యక్తి మనసుతో మమేకం కాడు.

విచారమార్గంలో, మనసు ఒక జడమైన పనిముట్టుగా వాడ బడుతుంది. రోజువారీ జీవన వ్యవహారాలలో మాత్రం దానిని శక్తిమంతమైన సాధనంగా ఉపయోగించుకుని, ఆత్మవిచారణ వచ్చేసరికి, దానికి స్వతంత్ర ఉనికిని ఇవ్వకుండ ఉపయోగపడని పనిముట్టుగా ప్రక్కకు పెట్టబడుతుంది. మనసుతో ఘర్షణ అంటూ వుండదు. మనసుతో మమేకం కాకపోవడమే అసలైన కిటుకు. కాని చెప్పినంత సులభంగా దానిని ఆచరించడం కుదరదు. అయినప్పటికి, ప్రయత్నంలో ఫలింప జేసుకుంటే, లక్ష్యం చేరినట్లే. అది సహజంగా అలవడుతుంది. "నేనే మార్గము, నేనే లక్ష్యము" అన్న బైబిల్ వాక్యం ఇక్కడ వర్తిస్తుంది.

సూటియైన మార్గం అయినందున, 'నేను ఉన్నాను' అన్న దానిపై ధ్యాసను కేంద్రీకరించడాన్ని 'మహాయోగా' అని పిలుస్తారు. ఇది సబబే. ఎందుకంటే, సాంప్రదాయిక యోగమార్గంలోని నాలుగు భాగాలలోను, అహం క్రమేపి సన్నగిల్లినప్పటికి, దాని ప్రాబల్యం వుండనే వుంటుంది. 'కర్త'గా కర్మయోగలోను, 'భక్తి'గా భక్తి యోగంలోను, 'ప్రమత' (తెలుసుకునేది)గా జ్ఞానయోగం లోను, 'యోగి' (ఏకత్వాన్ని ప్రయత్నించేది)గా రాజయోగంలోను, అహం ఉనికిని కలిగి వుంటుంది. ఇక విచారమార్గంలోనైతే, అహం ఏకంగా వేళ్ళతో పెకిలింప వేయబడుతుంది. అందుకే, అది ఇతర

నాలుగు యోగమార్గాలను, అన్ని యోగాల మాతగా, ఒక దెబ్బతో విలీనం చేసుకుంటుంది. నేరుగా 'సాధన'కు ఉపక్రమించడానికి సిద్ధంగా లేని మనసుగల వాళ్ళు పతంజలి యోగాన్ని ఆశ్రయించ వచ్చు. కాని ఈ రోజుల్లో విచారమార్గానికి తగిన మనఃపక్వతలేని వాళ్ళు తాము 'జ్ఞానమార్గీయుల'మని అనుకూలంగా ప్రకటించు కుంటారు. మూర్తిమత్వాన్ని పొందికపరిచి, మనసును శుద్ధిపరచడానికి అవసరమైన ప్రాథమిక యోగ సూత్రాలను పూర్తిగా అనవసరమన్నట్లు ప్రక్కకు పెట్టడం చింతించాల్సిన విషయం.

అలాగే, ప్రస్తుత కాలంలో యోగశాస్త్రాన్ని ఆసనాలు, ప్రాణా యామాలను ఆరోగ్యపరమైన లాభాలకు పరిమితం చేసి, వాటి యొక్క ఆధ్యాత్మిక ప్రయోజనాలను ప్రజలకు తెలుపక పోవడం దురదృష్టకరం. ఆధ్యాత్మిక స్వతంత్రతను సమర్థవంతమైన పనిముట్టుగా గుర్తించకుండ, ప్రాపంచిక జీవన విధానానికి పనికి వచ్చేదిగా మాత్రమే భావించబడుతోంది. అలాంటి ప్రయోజనానికి మాత్రం పరిమితి చేయడం యోగశాస్త్రాన్ని వక్రీకరించడమే అవుతుంది.

ఈ సందర్భంలో మూర్తిమత్వాన్ని సంయోగపరిచి, దానికి దైవత్వాన్ని ఆపాదించడమే యోగ యొక్క ముఖ్య పాత్ర అని గుర్తించాలి. చైతన్యవంతమైన మనసు అంతకంటే పెద్ద అచేతనమైన మనసును అదుపులో వుంచుతుంది. ఈ రెండూ ఒక పొందికలేని విధంగా ప్రవర్తిస్తుంటాయి. పూర్వ సంస్కారాలు (కోరికలు)తో ముడిపడివున్న కారణంగా, మన నిష్కపటత్వం అన్ని వేళల యథార్థమైనదని చెప్పలేం. యోగ మొదట

అచేతనమైన మనసును శుద్ధిపరిచి, జ్ఞానంతో ఉత్తేజితమైన బుద్ధి అదుపులో పనిచేసే చైతన్యమైన మనసుకు అనుగుణంగా వుండేలా చేస్తుంది. భగవద్గీత యోగ యొక్క వివిధ అంశాలను వేర్వేరు విధాలుగా - ''చర్యల్లో నిపుణత'', ''అన్ని ద్వంద్వ పరిస్థితుల్లో కూడ సమచిత్తత, నిశ్చింతమైన ప్రదర్శన'', ''తెలివితో విచక్షణాపూర్వకమైన జీవనాన్ని గడుపుతూ అన్ని దుఃఖాలు, బాధలకు దూరంగా వుండడం'' మొదలైనవిగా నిర్వచిస్తుంది. ప్రకృతిలో ఎదురయ్యే అన్నిటి పట్ల వ్యామోహము చూపకుండ, ఆత్మ, 'పురుష'తో సంపూర్ణ ఐక్యత చెందడమే యోగ లభింప జేసే ఆఖరి నైపుణ్యం. అదే యోగ యొక్క అసలైన లక్ష్యం.

---

*(23వ పేజీ తరువాయి)*

''జ్ఞానమార్గ విశిష్టతను నమ్ముకున్న వారిని అరుణాచలము ఆకర్షిస్తుంది''. తన కరుణా ప్రసారంతో పరమేశ్వరుడు భక్తులకు పెన్నిధి అయినాడు. ఈ స్వామి మహిమతో ఆకర్షితులైన అనేకమంది మహాత్ములు అరుణాచలాన్ని దర్శించారు. గుహ నమశ్శివాయ, గురు నమశ్శివాయ, ఈశాన్య దేశికులు, శేషాద్రి స్వామి, శ్రీ భగవాన్ రమణ మహర్షి యీ మహాత్ములలో కొందరు మాత్రమే. బహు దూరపు ప్రాంతాల నుంచి వచ్చిన వీరు, దారిలో వున్న అనేక క్షేత్రాలను కాదనుకొని యిచ్చటకు వచ్చి ఆది దేవుడైన అరుణాచలంలో లీనమై పోయారు. భావన ఒకటి చాలు. మనందరి మనస్సులూ శ్రీ అరుణాచలుని ఉన్నత శిఖరాలు చేరుకుంటాయి.

(సశేషం)

# Guru is Everything

Dr. K.Subrahmanian (Talk 60A)

In Bhagavan's *Ashtottaram* (108 Names) there occurs a name: *Bhava-roga bhishag-varah* (भवरोगभिषग्वरः). Bhava-roga means the disease of birth and death. In Shankara's composition '*Bhaja-govindam'* this is beautifully described:

पुनरपि जननं पुनरपि मरणं पुनरपि जननीजठरे शयनम् ।
इह संसारे बहुदुस्तारे कृपयापारे पाहि मुरारे ॥

Punarapi jananam, punarapi maranam
punarepi jananee jathare sayanam
Iha samsare bahu dustaare kripaya paare, paahi muraare.

We are born, we die, we take residence again in a mother's womb – the cycle continues. This is Bhava-roga. Shankara goes on to say, there is no way in which I can escape this and cross the vast ocean of samsara, and so, '*kripaya paare, paahi Muraare'* - O lord, you must help me to cross the ocean of samsara by your Grace.

We all feel at times that life is becoming more and more difficult and there is no point in living any longer. Fortunately or unfortunately this mood does not last very long. You feel the boredom, the misery of it. Inspite of all the riches that one may have, everyone feels this way, sometime or the other. Therefore we say, enough of this; this bhava-roga is too much to bear. That is when we should remember that Bhagavan is 'Bhava-roga bhishag-varah'. Bhishak means a doctor – he is the supreme doctor, who will cure the disease of birth and death. In other words, those who are bothered

from time to time by the thought of birth and death, for such people there is a doctor, and he is Bhagavan.

Bhagavan himself says, 'you are tired of the world and feel absolutely wretched when you are unhappy. You are not tired of the world when you are happy.' When we are unhappy, we are acutely conscious of the passage of time.Happiness is a state where you are not conscious of the passage of time. When you are in the company of the person you like the most, you are not conscious of the passage of time. But when you are in the presence of the person you don't like, one minute is equal to one hour. So, physical time is the same, but because of your mental attitude to the person or event, you feel the passage of time acutely.

Bhagavan says, you don't seek a doctor when you are happy, when you are unhappy you seek a remedy for it, you seek happiness. Because, happiness is our nature. And this happiness you enjoy when you are in deep sleep, when you are not conscious of your body, or your mind or even the world. Deep sleep is a state which is beyond the mind, and in that state, without doing anything we are happy. That is a state that does not come into being from outside. That is a state where there is an absence of body consciousness; there is absence of the mind that is always seeking something or the other. In deep sleep, the body-mind complex merges in the self. What does the doctor do? The doctor doesn't bring health from outside, he simply removes the cause of illness. There is something that obstructs your health which he removes. The moment the obstruction is removed, you enjoy the usual health.

A Guru is like that. He does not bring anything from outside, he only removes those things which are the cause of your unhappiness. He says, the flame of happiness is forever shining inside you *(atma-roopena bhaati )*. Though it is there all the time, we realize it only in deep sleep every day, because something is obstructing it at other times. The moment we get up, the mind becomes agitated, the mind becomes extremely active and therefore, we are not conscious of what is within us. We become conscious of it the moment the mind merges in the self, in deep sleep.

And so, Bhagavan says, we must make efforts – through his Grace- and must try to find out who we are. Or we must surrender totally to him. Each one has a duty to perform. Perform that duty to the best of your ability, and leave the results to the Supreme Being. It is most easy to say this, but most difficult even to have this attitude and it comes by his Grace. If we accept someone as our Guru, he will transform us in ways that we cannot understand or imagine. Bhagavan has said that Guru, God, the Self and Grace are all one and the same; they are just different names for the same thing. We all recite the verse :

Gurur-brahma gurur-vishnuh gurur-devo Maheshwarah
Guruh Saakshat Parabrahmam tasmai shree gurave namah.

